సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజన్న, ఎంపీపీ మానస

కేకే ఆరోపణలు సిగ్గుచేటు

- సిరిసిల్లను సస్యశ్యామలం చేసింది కేటీఆరే
- ఆరోపణలు చేస్తే సహించేదిలేదు
- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, ఎంపీపీ పడిగెల మానస

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 1: మెట్ట ప్రాంతమైన సిరిసిల్ల నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌దేనని తంగళ్లపల్లి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, ఎంపీపీ పడిగెల మానస పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సిరిసిల్ల అంటే కేటీఆర్.. కేటీఆర్ అంటే సిరిసిల్ల అని.. ప్రజలు చెప్పుకొనే విధంగా ఈ ప్రాంతాన్ని రామన్న అభివృద్ధి చేశారన్నారు. సిరిసిల్లలో వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశారన్నారు. కేటీఆర్‌పై కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని, అవాస్తవాలతో బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో ఇసుక విధానం లేక.. ఆ పైసలు ఎక్కడికి వెళ్లాయో తెలియదన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే మైనింగ్ పాలసీ ప్రవేశపెట్టి.. సీనరేజ్ నిధులు అభివృద్ధి పనులకు కేటాయించిందన్నారు. పావలా వడ్డీ మహిళా సంఘాల సభ్యులకు చేరుతుందన్న విషయం కూడా కేకే మహేందర్‌రెడ్డికి తెలియదా.. అని ప్రశ్నించారు. ఆరోపణలు పునరావృతమైతే ఊరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు మాట్ల మధు, వలకొండ వేణుగోపాల రావు, సింగిరెడ్డి రవీందర్‌రెడ్డి, పూసపల్లి సరస్వతి, ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, పడిగెల రాజు, బండి జగన్, కోడం సంధ్యారాణి, సద్ద రోజా, ములిగె దుర్గాప్రసాద్, క్యారం జగత్, కందుకూరి రామాగౌడ్, అవదూత మహేందర్, కొయ్యడ రమేశ్, సురభి నవీన్‌రావు, కుర్మ రాజయ్య, అడ్డగట్ల భాస్కర్, గగ్గిళ్ల ఆంజనేయులు, పర్కపల్లి తిరుపతి, కర్నె బాలయ్య, కొమురయ్య, భిక్షపతి, బాల్‌రెడ్డి, మహేశ్ పాల్గొన్నారు.

'గ్రీవెన్స్ డే'తో సత్వర న్యాయం

- ఎస్పీ అఖిల్ మహాజన్
- బాధితుల నుంచి 15 ఫిర్యాదులు స్వీకరణ

తెలంగాణ చౌక్, ఏప్రిల్ 1: ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. సోమవారం ఆయన జిల్లా పోలీస్ ఆఫీస్‌లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు 15మంది బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సంబంధితశాఖ అధికారులు వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. భూ తగాదాలు, ఆస్తి తగాదాల విషయంలో బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చూడాలని సూచించారు. గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిషారం అయ్యాయో.. ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్తులపై కఠిన వైఖరి అవలంభిస్తూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. గ్రీవెన్ డే ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ అధికారులకు దృష్టికి తేవడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని తెలిపారు.

కార్యవర్గ ప్రమాణ స్వీకారం

వేములవాడ, ఏప్రిల్1: విశ్వబ్రాహ్మణ ఐక్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సనుగుల సత్యం, వేములవాడ మండలాధ్యక్షుడు చందనం రవీందర్ ఆధ్వర్యంలో శ్రీ రాజరాజేశ్వర కార్పెంటర్స్ సైప్స్ సొసైటీ వేములవాడ సంఘం నూతన కార్యవర్గం సభ్యులు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. పట్టణాధ్యక్షుడిగా బోగోజి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా స్తంభంపల్లి శ్రీధర్, కోశాధికారిగా వేములవాడ ఆంజనేయులు, గౌరవాధ్యక్షుడిగా దర్శనాల శంకరయ్య, ఉపాధ్యక్షులుగా గణేశ్, కాసార్ల కరుణాకర్, కొత్తపల్లి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా కంచర్ల తిరుపతి, ముఖ్య సలహాదారుడిగా పుష్పల దేవయ్య, కార్యదర్శిగా చందనం సతీష్, ప్రచార కార్యదర్శిగా చందనం లక్ష్మణ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఇక్కడ గౌరవాధ్యక్షులు దుర్గయ్య, నాగభూషణం,రాములు, గౌరవ ఉపాధ్యక్షులు శ్రీనివాస్, రామలింగం, ముఖ్య సలహాదారులు వెంకటస్వామి, చంద్రయ్య, వెంకటచారి ఉన్నారు.

పక్కా ప్రణాళికతో తాగునీటి సరఫరా

వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రభుత్వం ముద్రించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, అధికారులు

- సీఎస్ శాంతికుమారి
- తాగునీటి సరఫరా, ధాన్యం కొనుగోళ్లపై వీసీ ద్వారా సమీక్ష

కలెక్టరేట్, ఏప్రిల్ 1: రానున్న రెండు నెలలపాటు పక్కా ప్రణాళికతో తాగునీటి సరఫరా చేపట్టాలని, ప్రజలకు ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి వేసవి తాగునీటి సరఫరా ప్రణాళిక, ధాన్యం కొనుగోళ్లు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, వేసవిలో తాగునీటి సరఫరాపై అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి సన్నద్ధంగా ఉన్నామన్నారు. ప్రతి రోజూ తాగునీటి సరఫరాను పర్యవేక్షించాలని, ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. మిషన్ భగీరథ వ్యవస్థను పూర్తి స్థాయిలో వినియోగించాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

వరి కోతలు ప్రారంభమైన నేపథ్యంలో అవసరమైన మేర ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సీఎస్ స్పష్టం చేశారు. రాబోయే నాలుగు రోజుల్లో 7,149 కేంద్రాలను ప్రారంభించాలని ఆదేశించారు.

సర్కారు బడుల్లో వసతులు కల్పించాలి

జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, నిరుపయోగంగా ఉన్న టాయ్‌లెట్లను ఉపయోగంలోకి తేవాలని, తరగతి గదులకు మరమ్మతులు పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. వడగాల్పులు వీస్తు న్న నేపథ్యంలో అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని, తగిన జాగ్రత్తలు పాటించాలని పలు సూచనలు చేశారు. వీసీ అనంతరం అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. వీసీలో కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్, డీఈవో రమేశ్‌కుమార్, డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు, ఏవో రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నందున ఎండదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు పూజారిగౌతమి, ఖీమ్యానాయక్‌తో కలిసి ఎండదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించే పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ఎండదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని, ఎండల్లో తిరగవద్దని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. మధ్యాహ్నం 12నుంచి సాయంత్రం 4గంటల మధ్యలో ఇండ్ల నుంచి బయటకు రావద్దని తెలిపారు.

వేములవాడ: నిత్యాన్నదాన ట్రస్టు భూమిపూజ కార్యక్రమానికి హాజరైన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, నాయకులు

రాజన్న భక్తుల సేవలో తరించాలి

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ, ఏప్రిల్ 1: రాజన్న సన్నిధికి వచ్చే భక్తుల సేవలో తరించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని శ్రీ రాజరాజేశ్వర క్షేత్ర ఆర్యవైశ్య వాసవీ అన్నపూర్ణ నిత్యాన్నదాన ట్రస్టు నూతన భవన నిర్మాణ భూమిపూజ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. నిస్వార్థమైన సేవను భక్తులకు అందించి, వారి మన్ననలు పొంది స్వామివారి కృపకు పాత్రులు కావాలని సూచించారు.

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయం

వేములవాడ రూరల్, ఏప్రిల్ 1: అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం ఆయన వేములవాడ రూరల్ మండలం నాగయ్యపల్లి, పోచెట్టిపల్లి గ్రామాల్లో పర్యటించారు.

బీరప్ప జాతర ఉత్సవానికి హాజరు

చందుర్తి, ఏప్రిల్ 1: మండల కేంద్రంలో బీరప్ప స్వామి జాతర ఉత్సవానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. స్వామివారి కల్యాణోత్సవాన్ని, పట్నం వేసే కార్యక్రమాన్ని పూజారులు నిర్వహించగా విప్ పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, ఏప్రిల్ 1: జిల్లాలోని ఎస్సీ అభ్యర్థులకు ఎస్సీ స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో మూడు నెలలపాటు ప్రత్యేక ఫౌండేషన్ కోర్సు, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తామని, ఈ మేరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి మెట్టు విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలతోపాటు గ్రూప్-1 ప్రిలిమ్స్ కోసం 60మంది అభ్యర్థులకు శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజన వసతితో కల్పిస్తామని వెల్లడించారు. ఈ నెల 3న చంద్రంపేటలోని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్‌లో జరిగే స్పాట్ అడ్మిషన్స్‌కు హాజరుకావాలన్నారు. వివరాలకు నంబర్‌ను (95156 22390) సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 1: జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా మంగళవారం సరఫరాలో అంతరాయం కలుగుతుందని సెస్ ఏఈ మధుకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ప్రగతినగర్, వెంకంపేట, సర్దార్‌నగర్‌లో ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ముస్తాబాద్: తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

అన్నదాతలను ఆదుకోండి

- ఎండిన పంటలకు పరిహారం ఇవ్వాలని బీజేపీ నేతల వినతి

ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్/వేములవాడ రూరల్/ఇల్లంతకుంట/ కోనరావుపేట/బోయినపల్లి/చందుర్తి, ఏప్రిల్ 1: సాగునీరందక ఎండిపోయిన పంటపొలాలతోపాటు ఇటీవల పడిన వడగండ్ల వానతో పంటలు దెబ్బతిన్నాయని, ఈ క్రమంలో రైతాంగానికి అండగా ఉండి ఆదుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. సోమవారం వారు జిల్లాలోని పలు మండలాల్లో తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. వడగండ్ల వానకు దెబ్బతిన్న, సాగునీరందక ఎండిపోయిన పంటలకు ఎకరానికి ₹20 వేల నష్టపరిహారం చెల్లించాలని, రైతు భరోసా ద్వారా ఎకరానికి ₹15వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. క్వింటాల్‌కు ₹500 బోనస్ అమలు చేయాలని, కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని కోరారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు.

గుడుంబా స్థావరాలపై దాడి

కోనరావుపేట, ఏప్రిల్ 1: భూక్యారెడ్డితండాలో గుడుంబా స్థావరాలపై ఎస్ఐ ఆంజనేయులు సిబ్బందితో కలిసి దాడి చేశారు. తండాలోని బానోత్ రాజు ఇంటి వద్ద పది లీటర్ల నాటుసారా, 50లీటర్ల బెల్లం పానకాన్ని పట్టుకుని ధ్వంసం చేశారు. బాధ్యులైన రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం, గుడుంబా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ప్రకాశ్‌రావు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి

కొప్పుల పరామర్శ

జగిత్యాల, ఏప్రిల్ 1: నమస్తే తెలంగాణ కరీంనగర్ బ్రాంచ్ మేనేజర్, బ్యూరో ఇన్‌చార్జి కడపత్రి ప్రకాశ్‌రావు తల్లి సావిత్రి ఇటీవల మృతి చెందగా, సోమవారం వారి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. సావిత్రి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, గ్రంథాలయ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, బీఆర్ఎస్ నాయకుడు ఓరుగంటి రమణారావు, తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ అందించాలి

కలెక్టరేట్, ఏప్రిల్1: జిల్లాలోని రైస్ మిల్లర్లు సీఎంఆర్ త్వరగా అందించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో వానకాలం 2023-24 సీజన్‌కు సంబంధించి సీఎంఆర్ సరఫరాపై జిల్లాలోని రా, బాయిల్డ్ రైస్ మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. 2023-24 సీజన్‌లో1,34,588టన్నుల బియ్యం ప్రభుత్వానికి రావాల్సి ఉండగా ఇప్పటి వరకు 8,236 టన్నులు అందజేశారని తెలిపారు. మిగతాది త్వరలో అందిం చాలన్నారు. ఈ మేరకు తహసీల్దార్లు రోజు వారీగా మండలాల పరిధిలో ఉన్న మిల్లుల ద్వారా ప్రతి రోజూ 75లారీల బియ్యం సరఫరా అయ్యేలా చూడాలని ఆదేశించారు. అలాగే యాసంగి 2023-24 సీజన్‌లో ప్రతి మిల్లర్ ఎలాంటి కోతలు లేకుండా వరి ధాన్యం దిగుమతి చేసుకోవాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★I, GURUDEEP SINGH, R/o. 8-2-86/4, Hariharanagar, Kattarampur, Karimnagar, TS. Changed My Name as SARDAR GURUDEEP SINGH, S/o. Sardar Nirmal Singh.
NT-311780

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

గడువు పొడిగింపు

కలెక్టరేట్, ఏప్రిల్ 1: స్ట్రింగర్ పోస్టుల దరఖాస్తు కోసం ఈ నెల 30వరకు గడువు పొడిగించామని దూరదర్శన్ జాయింట్ డైరెక్టర్ రాహుల్ గౌలికార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని దూరదర్శన్ ప్రాంతీయ వార్తల కేంద్రం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో స్ట్రింగర్ పోస్టుల నియామక ప్రక్రియ చేపట్టిందని, ఇందుకోసం గత ఫిబ్రవరి 27న నోటిఫికేషన్ విడుదల చేసిందని తెలిపారు. హైదరాబాద్ దూరదర్శన్ ప్రాంతీయ వార్తల కేంద్రం పరిధిలో స్ట్రింగర్ పోస్టు కోసం పని చేయడానికి ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 30లోగా వెబ్‌సైట్‌లో (www.prasarabharati.gov.in/pbvacancies) దరఖాస్తు చేసుకోవచ్చని జాయింట్ డైరెక్టర్ రాహుల్ గౌలికార్ చెప్పారు.

పక్కాగా శిక్షణ అందించాలి

- వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్
- పోలింగ్ సిబ్బందికి శిక్షణ

కలెక్టరేట్: పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఆర్డీవో రాజేశ్వర్

కలెక్టరేట్, ఏప్రిల్ 1: పార్లమెంట్ ఎన్నికల విధులకు హాజరయ్యే పోలింగ్ సిబ్బందికి శిక్షణ తరగతులు సక్రమంగా నిర్వహించాలని వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ సమావేశ మందిరంలో ప్రిసీడింగ్, సహాయ ప్రీసీడింగ్ అధికారులు చేయాల్సిన విధులపై సెక్టోరల్ అధికారులు, మాస్టర్ ట్రైనర్లకు పీపీటీ ద్వారా నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై, మాట్లాడారు. ఎన్నికలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. నిబంధనలపై అవగాహన ఉంటే ఎన్నికల ప్రక్రియ సజావుగా జరుగుతుందని తెలిపారు. పోలింగ్ అధికారులకు ముఖ్యంగా ఈవీఎం యంత్రాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మాక్‌పోల్ నిర్వహణ, ఈవీఎం యంత్రాల పనితీరు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వివి ప్యాట్ల కనెక్షన్లు, వాటి పనితీరు, మరమ్మతు జరిగితే తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సమావేశంలో సీపీవో, ట్రైనింగ్ నోడల్ అధికారి పీబీ శ్రీనివాసచారి, మాస్టర్ ట్రైనర్స్, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు: డీఎస్పీ

వేములవాడ రూరల్, ఏప్రిల్ 1: ఎన్నికల నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని వేములవాడ డీఎస్పీ నాగేంద్రాచారి హెచ్చరించారు. సోమవారం ఆయన వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో వివిధ పార్టీ నాయకులతో సమావేశమై, మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎవరైనా కోడ్‌ను ఉల్లంఘిస్తే నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు అన్ని పార్టీ నాయకులు సహకరించాలని కోరారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా తమకు సహకరించాలని పార్టీ నాయకులను కోరారు. అనంతరం ఎన్నికల నియామవళిపై అవగాహన కల్పించారు. ఇక్కడ వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మారుతి, ఆయా పార్టీల నాయకులు, తదితరులు ఉన్నారు.

సంతకం ఫోర్జరీ చేసిన ఒకరిపై కేసు

చందుర్తి , ఏప్రిల్ 1: జోగాపూర్ పంచాయతీ కార్యదర్శి ఎర్రం కవిత సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ ముద్రలు వేసిన గ్రామానికి చెందిన బుర్ర వెంకటేష్‌పై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు, ఇంటి నిర్మాణ రుణం కోసం ప్రైవేట్ బ్యాంకులో వెంకటేష్ దరఖాస్తు చేసుకోగా, అందులో పంచాయతీ కార్యదర్శి పత్రాన్ని సమర్పించాల్సి ఉంది. దీంతో అధికారులు విచారణ కోసం గ్రామ పంచాయతీ కార్యదర్శి వద్దకు రాగా, నకిలీ ధ్రువ పత్రమని తేలింది. ఈ మేరకు కార్యదర్శి ఠాణాలో ఫిర్యాదు చేయగా వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లైంగికదాడి చేసి.. హతమార్చారు

- మహిళ హత్య కేసు మిస్టరీ వీడింది
- అంతర్రాష్ట్ర కూలీలే నిందితులు..
- ఒకరి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

తెలంగాణచౌక్, ఏప్రిల్1: జిల్లా కేంద్రంలో 15 రోజుల కింద జరిగిన ఓ మహిళ హత్య కేసు మిస్టరీ వీడింది. ఇక్కడికి వలస వచ్చిన ఇద్దరు అంతర్రాష్ట్ర కూలీల పనే నని గుర్తించిన పోలీసులు, ఇందులో ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు సోమవారం ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాలు వెల్లడించారు. బిహార్ రాష్ట్రానికి చెందిన రూడల్ సదా, రామ్రిక్స్ సదా ఇద్దరూ కూలీలు ఆరు నెలల కింద ఉపాధి కోసం జిల్లా కేంద్రానికి వచ్చారు. అశోక్‌నగర్‌లో రామస్వామి ఇంటిని కిరాయి తీసుకొని కూలీ చేసుకుంటేన్నారు. వీరికి వేములవాడ రూరల్ మండలం కొడుముంజకు చెందిన మహిళా కూలీ అలకుంట రమతో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో ఈ ఇద్దరు కూలీలు ఆమెను తమ రూమ్‌కు తీసుకువచ్చేందుకు పథకం పన్నారు. అయితే వీరి రూంపక్కన మరో నలుగురు కూలీలు కిరాయికి ఉంటుండడంతో రమను ఇంటికి తీసుకురావడం వీలుకాలేదు. అయితే గత మార్చి 19న పక్క రూమ్ వాళ్లు బీహార్‌కు వెళ్లడం గమనించిన నిందితులు, రమను తమ ఇంటికి తీసుకువచ్చారు. ముగ్గురూ కలిసి మద్యం తాగారు. ఆమె మత్తులోకి వెళ్లగానే ఇద్దరూ అత్యాచారం చేశారు. మత్తు దిగిన తర్వాత ఎవరికైనా చెబుతుందని భయంతో సిలిండర్‌తో ఆమె తలపై కొట్టి హతమార్చారు. తమ వెంట తెచ్చుకున్న సామగ్రి తీసుకొని ఎవరికీ అనుమానం రాకుండా తమ రాష్ట్రానికి పారిపోయారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసుల బృందం బీహార్ రాష్ట్రానికి వెళ్లారు. ఏ1 నిందితుడు రూడల్ సదా అక్కడ లేడు. ఏ2 నిందితుడు అయిన రామ్రిక్స్ సదాను అరెస్టు చేసి, తీసుకువచ్చారు. రిమాండ్‌కు తరలించారు. కాగా, రూడల్ సదా పరారీలో ఉన్నాడని, త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఎస్పీ తెలిపారు. ఇక్కడ డీఎస్పీ చంద్రశేఖర్, సీఐ రఘుపతి, టాస్క్‌ఫోర్స్ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ రమాకాంత్, సిబ్బంది ఉన్నారు.

హత్య వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

కుక్క కాటుతో యువకుడి మృతి

కోనరావుపేట, ఏప్రిల్ 1: కుక్క కాటు గురైన ఓ యువకుడు దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని ధర్మారంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మంకు వినోద, శంకర్ దంపతులకు ఇద్దరు కొడుకులు అరవింద్, అరుణ్(28), కూతురు అశ్విని ఉండగా, వీరు ఇదే మండలంలోని నిజామాబాద్ గ్రామంలో నివసిస్తున్నారు. అరుణ్ మాత్రం ధర్మారంలోని తన నానమ్మ, తాతయ్య ఇంటి వద్ద ఉంటున్నాడు. నెల రోజుల క్రితం నిజామాబాద్ గ్రామానికి వెళ్లగా అక్కడ పలువురు వ్యక్తులతోపాటు అరుణ్‌పైన కూడా పిచ్చి కుక్కలు దాడి చేశాయి. దీంతో గాయపడ్డ అతను స్థానికంగా ప్రాథమిక చికిత్స తీసుకున్నాడు. 15 రోజుల తర్వాత ఉన్నట్టుండి తీవ్ర అస్వస్థతకు గురికాగా కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోదకు తరలించారు. అక్కడి నుంచి నాలుగు రోజుల కిందట గాంధీ దవాఖానకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి మృతిచెందాడు. కాగా, అతడికి వైద్యం కోసం సుమారు రూ.15 లక్షల వరకు ఖర్చు చేసి వైద్యం చేయించినప్పటికీ మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసి మంచి పేరు తెచ్చుకున్న అరుణ్ చిన్న వయసులోనే మృతిచెందడంతో మండల వాసులు ప్రగాఢ సానూభూతి వ్యక్తం చేశారు.

పెద్ద చెరువు పరిశీలన

- 'నమస్తే' కథనానికి స్పందన

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్1: దుమాలలోని పెద్దచెరువు భూమి అన్యాక్రాంతం అవుతున్న తీరుపై ముదిరాజ్ సంఘం సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో 'అన్యాక్రాంతం.. అభ్యంతరకరం' పేరిట నమస్తే తెలంగాణలో సోమవారం ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించి, పెద్ద చెరువును పరిశీలించారు. వానకాలంలో నీళ్లు చెరువులోకి వచ్చిన తర్వాత హద్దులను నిర్ణయిస్తామని, అప్పటి వరకు ఎలాంటి పనులు చేపట్టవద్దని సదరు భూమి కొనుగోలు చేసిన వ్యక్తిని సూచించారు.

నాయబ్ తహసీల్దార్‌గా జయంత్‌కుమార్

కోనరావుపేట, ఏప్రిల్ 1: ఎల్లారెడ్డిపేట మండల నాయబ్ తహసీల్దార్ జయంత్‌కుమార్ బదిలీపై కోనరావుపేటకు రాగా, సోమవారం ఆయన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఎలుసాని ప్రవీణ్‌కుమార్, ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ రామ్‌చందర్, కోనరావుపేట తహసీల్దార్ విజయ్‌ప్రకాష్‌రావు, టీఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షుడు కాల్వ ప్రవీణ్‌కుమార్, టీఎన్జీవో ఎల్లారెడ్డిపేట యూనిట్ అధ్యక్షుడు గౌసొద్దీన్, ఆర్ఐలు రాజశే